ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 18 | సంచిక : 07 | మార్చి 2013



రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 16

గౌరవ సంపాదకులు

శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా

సంవత్సర చందా:రు|| 150/-

విడి ప్రతి : రు|| 15/-

చిరునామా

రమణ భాస్కర

శ్రీ రమణ క్షేత్రం,

జిన్నూరు – 534 265

ప||గో|| జిల్లా, ఆం||ప్ర||

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు – 534 265

☎ 08814 - 224747

9247104551


ఈ సంచికలో....


జిన్నూరు ......... 27-01-2013

మురమళ్ళ ....... 07-01-2013



ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్

(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,

పాలకొల్లు, 9848716747


## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 27-01-2013, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనిషికి తొందరగా అసూయ వచ్చేస్తుంది. మనం వ్యాపారం చేయాలి అంటే దానికి పెట్టుబడి ఉండాలి కాని అసూయకు పెట్టుబడి అక్కరలేదు. ఆర్థికస్థితిలోగాని, విద్యలోకాని మనం తక్కువవారము, వాళ్ళు ఎక్కువవారు అని మనస్సులో అనుకొన్నప్పడు మీకు అసూయ వచ్చేస్తుంది. మీరు తక్కువవారు అని అనుకొంటూ ఉంటే అసలు మీ ఆలోచనా విధానం సరిగా లేదు అని అర్థం. ధనం ఎప్పడూ ఒకరి దగ్గర స్థిరంగా ఉండదు అలా మారుతూ ఉంటుంది. అందుచేత ధనంలో గాని, విద్యలోగాని మీకంటే ఎవరైనా ఆధిక్యంలో ఉంటే ఉండనివ్వండి, దానివలన మీకు నష్టంలేదు. మీపని ఏదో మీరు జాగ్రత్తగా చేసుకోండి, మీ సంపాదన జాగ్రత్త పెట్టుకోండి. అమెరికాలాంటి దేశాలలో ఇతరుల గొడవ పెద్దగా ఉండదు అందుచేత అసూయ అంటే వారికి తెలియదు. వారికి కులాల గొడవ, మతాల గొడవ లేదు. మనకు ఎంతసేపు కులాల గొడవ, మతాలగొడవ ఎక్కువ, మనకు దేశభక్తి లేదు. అర్జునుడిని అనసూయుడు అంటారు. అంటే అసూయ ఎలా ఉంటుందో తెలియని వాడు. రామకృష్ణమఠంవారు మతాల గొడవలలోనికి, రాజకీయాలలోనికి రారు. మేము బురదలో బెడ్డ వెయ్యం అంటారు. బురదలో బెడ్డవేస్తే ఎవడికి నష్టం, వేసినవాడికే నష్టంకదా. అందుచేత మేము రాజకీయాల జోలికి రాము అని చెపుతారు. ఈ మతాలు, దేవతలు, గుడులు, గోపురాలు ఇవి అన్నీ మనస్సు కల్పితం, హృదయంలో అంతర్యామిగా ఉన్నవాడు ఒక్కడే నిజం. రామకృష్ణుడు ఏమని చెప్పాడంటే అన్ని మతాలు

భగవంతుని దగ్గరకే చేరుస్తాయి. అందుచేత మతద్వేషాలు అనవసరం అని చెప్పాడు.

మీరు ఏదైనా పని చేసేటప్పుడు ఆ పని మంచిదా, చెడ్డదా? అది యితరులకు ఏమైనా ఉపయోగపడుతుందా? పోనీ యితరులకు ఉపయోగపడకపోయినా కనీసం మనకైనా ఉపయోగపడుతుందా అని జాగ్రత్తగా చూసుకోవాలి. ఎప్పడు కూడా రీజన్‌ను విడిచిపెట్టకూడదు, మంచితనాన్ని విడిచిపెట్టవద్దు. ఇక్కడ కృష్ణుడు చెప్పిన రహస్యం ఏమిటి అంటే సూర్యుడు ఎంతగొప్పవాడైనా ఎంత పెద్దవాడైనా మేఘాలు కమ్మేసినప్పడు సూర్యుడు మనకు కనబడడు. మేఘాలు సూర్యుడు అంత గొప్పవి కాకపోయినా ఆయన మనకు కనబడకుండా చేయటానికి ఉపయోగపడుతున్నాయి. అలాగే మీలో మంచితనం ఉన్నప్పటికీ, రీజన్ ఉన్నప్పటికి మీరు ప్రతీ చిన్న విషయానికి ఉద్రేకపడుతూ ఉంటే మీలో ఉన్న రీజన్ పోతుంది. అంటే ఆలోచించే శక్తి పోతుంది, మంచితనం కూడా తగ్గిపోతుంది. అంటే మీలో ఉన్న ఉద్రేకం మీ తెలివితేటల్ని, మంచితనాన్ని కమ్మేస్తుంది. అపుడు మీరు ఏమి చేస్తున్నారో, మీరు ఏమి మాట్లాడుతున్నారో మీకే తెలియదు. అందుచేత మీరు ప్రతీ విషయానికి ఉద్రేకపడకుండా నిర్మలంగా ఉండటానికి ప్రయత్నం చేయండి. వేదాలలో చాలా విషయాలు చెప్పారు. మనుషులకు కోరికలు ఉంటాయి. ఏది చేస్తే ఆ కోరికలు నెరవేరతాయో వారికి తగ్గట్టుగా వేదాలలో చెప్పారు. ఒకవేళ అలా చేస్తే ఆ కోరికలు నెరవేరితే నెరవేరవచ్చు. ఆ కోరికలు ఉన్నవారికి అవి అన్నీ చెప్పాడు. నీకు ఆ గొడవలు వద్దు. నీ మనస్సులో భోగవాసన ఉంటే సడన్‌గా దానిని ఏక్షన్‌లో పెట్టవద్దు, దానిమీద ఆసక్తి తగ్గించుకో. వేదాలలో చెప్పారని నువ్వు ఆ గొడవలలోనికి వెళ్ళకు, ఆ గొడవలన్నీ వదిలేస్తేనే గాని అజ్ఞానం అనే అడవిలోనుండి నువ్వు బయటకు రాలేవు.

రామకృష్ణుడు ఏమనిచెప్పాడంటే లోకాన్ని మూడు జబ్బులు పట్టుకొన్నాయి. అవి లోకం చుట్టూ తిరుగుతూ లోకాన్ని కమ్మేస్తున్నాయి. అందుచేత ఎవడూ మోక్షాన్ని పొందలేక పోతున్నాడు. ఆ జబ్బులు ఏమిటంటే 1. స్త్రీ మీద పురుషుడికి, పురుషుడి మీద స్త్రీకి ఉన్న మోహం, 2. ధనకాంక్ష, 3. కీర్తి కాంక్ష, కొంతమందికి డబ్బు పెరిగినా బుద్ధి పెరగదు. డబ్బుతో పాటు బుద్ధి పెరిగితే ఫరవాలేదు కాని డబ్బు పెరిగి బుద్ధి పెరగకపోతే అదే వాడి నాశనానికి కారణం అవుతుంది. ఈ పని చేస్తే నాకు ఏమి గౌరవం వస్తుంది అని నువ్వు ఎంతసేపు గౌరవాలకోసం, కీర్తికోసం చూస్తూ ఉంటే ఇంక నీ మనస్సు అంతర్ముఖం అవ్వదు. మనస్సు అంతర్ముఖం అయితేనేగాని ఆత్మజ్ఞానం కలుగదు. రామకృష్ణుడు ఎవరినీ

పొగిడేవాడుకాదు అంటే పొగిడి వారిని పాడుచేయకూడదని ఆయన పొగడ్తల జోలికి వెళ్ళలేదు. నీలో ఈ బలహీనతలు ఉన్నాయి, వాటిని పోగొట్టుకోవటానికి నేను నీకు సహకరిస్తాను అయినా నువ్వు తీసుకోలేకపోతే నేను వాటిని నాకేస్తాను అనేవాడు, వాడు గురువు. ఒకవేళ నువ్వు తీసుకోలేవు అనుకో భగవంతుడిపట్ల నీకు ఉన్న భక్తి నిజమైతే నిన్ను పాడుచేసే గుణాలన్నింటినీ నాకేస్తాను అని చెప్పాడు. ఆ మాట చెప్పటానికి ఎంత ధైర్యం ఉండాలి, ఎంత ఆత్మవిశ్వాసం ఉండాలి.

ప్రతీమనిషికి సుఖంకావాలి, శాంతి కావాలి, ఆనందం కావాలి. కాని అది ఎక్కడ దొరుకుతుందో వాడికి తెలియటంలేదు. మహర్షులు, మహాత్ములు ఏమని చెప్పారు అంటే నీకు ఎంత ఆనందం కావాలో అంత నీ హృదయంలోనే ఉంది. కాని అది నీకు అందాలంటే నీ మనస్సు అంతర్ముఖం అవ్వాలి. నీకు చెరుకుగడ అంటే ఇష్టం అనుకో, అది తిన్నప్పడు నీ మనస్సు అంతర్ముఖం అవుతుంది. మనస్సు అంతర్ముఖమైనప్పడు హృదయంలో ఉన్న శాంతి దానికి అందుతుంది. కాని మీరు ఏమనుకొంటున్నారు అంటే చెరుకుగడ తినటంవలన శాంతి వచ్చింది అనుకొంటారు. చెరుకుగడ తినటం వలన శాంతి వస్తే మరి చెరుకుగడ తినేవారందరికీ శాంతి రావాలికదా! మరి అందరికీ వస్తోందా? రావటం లేదు. వారికి ఇష్టమైనది తిన్నప్పడే శాంతి వస్తోంది. ఇది మీరు అబ్జర్వు చేసి చూడండి. చెరుకుగడలో ఆనందంలేదు, అందులో ఆనందం దొరికితే రోజూ చెరుకుగడ తినవచ్చు. మీ కోరిక ఏదైనా నెరవేరింది అనుకోండి, అప్పడు మనస్సు దాని పుట్టుస్థానమైన హృదయంలోనికి ఉపసంహరింపబడుతుంది. హృదయంలో ఆనందం, శాంతి ఉన్నాయి కాబట్టి దానికి ఆనందం అందుతుంది. కాని మనస్సు అక్కడ నిలబడదు మరల బయటకు వచ్చేస్తూ ఉంటుంది. ఇవన్నీ తాత్కాలిక విషయాలు. ఆనందంకోసం, శాంతికోసం బాహ్యపదార్థాలమీద ఆధారపడితే చివరకు మీకు దుఃఖం మిగులుతుంది.

నీకు భోగవాసన ఉంటే ఏ భోగానికి సంబంధించిన వాసన ఉందో చూసుకొని నీకు ఆ తలంపు వచ్చినప్పడు యాక్షన్‌లో పెట్టవద్దు, దానిని ఇంద్రియాల దాకా రానివ్వకుండా భగవంతుడిని స్మరించుకుంటూ ఉంటే ఆ తలంపు యొక్క వేగం తగ్గిపోయి, అది ఎక్కడైతే పుట్టిందో అక్కడకు ఉపసంహరింపబడి నెమ్మదిగా సన్నగిల్లి నశించిపోతుంది. మనకు సినిమా చూడాలని తలంపు వచ్చింది అనుకోండి, వెంటనే సినిమాకు వెళ్ళిపోతాము. అలా కాకుండా మీరు భగవంతుడిని స్మరించుకుంటే, భగవద్గీత చదువుతూ ఉంటే నెమ్మదిగా ఆ

తలంపు పోతుంది. దీనికి ఎంతోకొంత వైరాగ్యం ఉండాలి. మనం ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి రావాలంటే వివేకం, వైరాగ్యం ఇవి రెండూ అవసరం. వైరాగ్యం లేని మనిషికి అసలు ఆత్మజ్ఞానం కలుగదు. జీవితంలో ఎప్పుడైనా సంతోషం వస్తూ ఉంటుంది, అది ఒక ఉద్రేకం. మీకు ఎప్పుడైనా దుఃఖం వస్తూ ఉంటుంది, అది ఒక ఉద్రేకం. ఇవి ఏమీ నిజంకాదు. ఈ రోజు ఉన్న సంతోషం రేపు ఉండకపోవచ్చు. ఇవి అన్నీ తాత్కాలికంగా వస్తూ ఉంటాయి, పోతూ ఉంటాయి. మీకు దుఃఖం వచ్చింది అనుకోండి, ఆ దుఃఖం తగ్గటానికి మందులు మింగనక్కరలేదు, కాలప్రవాహంలో మీకు దుఃఖం పోతుంది, కాలప్రవాహంలో అన్నీ కొట్టుకొనిపోతాయి. అందుచేత ఈ ద్వంద్వములకు అతీతుడవుకమ్ము. ఒకోసారి ఏమీ శక్తిలేనివాడు నెగ్గుతూ ఉంటాడు, తప్పనిసరిగా నెగ్గుతాడు అనుకొన్నవాడు ఓడిపోతూ ఉంటాడు. ఎందుకు అలా జరిగింది అంటే ఈ జీవితంలో జరిగే సంఘటనలకు పూర్వజన్మలకు సంబంధం ఉంటుంది. భగవాన్‌కు సాధన ఏమీ లేకుండానే చదువుకునే వయస్సులో మరణానుభవం ద్వారా ఆత్మజ్ఞానం కలిగింది. కొంతమంది భక్తులు భగవాన్‌తో ఏమన్నారంటే మీకు ఏమీ కష్టంలేకుండా ఆత్మజ్ఞానం వచ్చేసింది, మేము ఎంత కష్టపడినా మనస్సు అంతర్ముఖం అవ్వటం లేదు. మీరు ఏవో మాటలు చెపుతున్నారు. మాటలు చెప్పటం తేలిక. ఆత్మజ్ఞానం సంపాదించటానికి మేము చాలా కష్టపడుతున్నాము కాని మాకు రావటంలేదు. ఆత్మజ్ఞానం పొందటానికి ఇప్పుడు మీరు ఏమి కష్టపడ్డారో చెప్పండి అని అడిగారు. భగవాన్ ఏమని చెప్పారంటే నేను ఏమీ కష్టపడలేదని, ఏమీ సాధన చేయలేదని మీరు అనుకోకండి. అదంతా పూర్వజన్మలలో అయిపోయి ఉండవచ్చు. ఈ కష్టాలు అన్నీ పూర్వజన్మలలో పడే ఉంటాను అని చెప్పారు. భగవంతుడికి అందరూ సమానమే, నేను మీకు ఆత్మజ్ఞానం ఇస్తాను అనేవారు కాదు. నాకు ఆత్మజ్ఞానం ఎవడైతే ప్రసాదించాడో వాడే మీకూ ప్రసాదిస్తాడు. నాకు ప్రసాదించిన వాడు వేరు, మీకు ప్రసాదించేవాడు వేరుకాదు. ఉన్నది ఒక్కడే అని చెప్పారు. ఇది తెలివితేటల వలన వచ్చేది కాదు. దేవుని అనుగ్రహం ఉండాలి. అందుచేత మీ మాట, మీ చేత, మీ ఆలోచన అన్నీ ఈశ్వరుని దయను పొందే రీతిలో ఉండాలి. మీరు ఈశ్వరుని దయను కనుక సంపాదిస్తే ఆయన స్వరూపాన్ని మీకు ఇస్తాడు, ఆయన స్వరూపమే మోక్షం.

మీరు ఒకటి గుర్తుపెట్టుకోండి. అసలు శరీరం వచ్చిందంటే వాడు ధనవంతుడు అయినా, పేదవాడు అయినా వాడికి దుఃఖం తప్పదు. వారు మనవారు, వీళ్ళు పరాయి

వాళ్ళు అనే బుద్ధి వాడికి కలుగుతూ ఉంటుంది. శరీరం వచ్చిందంటే ఎటాచ్‌మెంట్ తప్పదు, రోగం తప్పదు, ఆరోగం వలన వచ్చే పీడ తప్పదు. ప్రకృతి గుణాలు దాటితేనే గాని పునర్జన్మ రాకుండా మనం ఆపుచేయలేము. నూటికి నూరుపాళ్ళు ఇతరులకోసం జన్మించిన వారిని కారణజన్ములు అంటారు. అంటే వారికి శరీరం ఉంటుంది కాని ఆ శరీరం వాళ్ళు కాదని వారికి తెలుస్తూ ఉంటుంది, మనం ఈ దేహమాత్రులం కాదు అనే అనుభవం వారికి లోపల ఉంటుంది. కృష్ణుడి మాటలు కొన్ని గుర్తుపెట్టుకొంటే అసలు మనకు గర్వం రావటానికి అవకాశం లేదు. కృష్ణుడు అర్జునుడితో ఏమన్నాడంటే ఈ భీష్ముడిని ఎలా చంపటం, ద్రోణుడిని ఎలా చంపటం వారు బంధువులు, గొప్పవీరులు వీరిని ఎలా చంపటం అని నువ్వు ఆలోచిస్తున్నావు. యిప్పటికే నేను వారిని చంపి ఉంచాను, నేను చంపిన వారినే నువ్వు చంపుతున్నావు. అర్జునుడు గొప్పగా యుద్ధం చేసాడు అని ప్రజలు అనుకొంటారు. పని నాది కీర్తి నీది అని చెప్పాడు. డైరెక్టర్లు ఎక్కువ కష్టపడతారు కాని నటులకు ఎక్కుగా పేరు వస్తుంది. ప్రతీ మనిషికీ డైరెక్టర్ ఎవరు అంటే భగవంతుడే. ఆయన మన లోపలే ఉన్నాడు. చేసేది అంతా ఆయనే. ఆయన సాధించిపెట్టిందే, మనం సాధించాము అనుకుంటాము. ఉన్నది ఆయనే, మనం లేము. కృష్ణుడు దేవుడు అనుకుంటున్నాము. ఆయన ఆడినమాట చాలాసార్లు తప్పాడు. ఎందుచేతనంటే ధర్మాన్ని రక్షించటం కోసం అబద్ధాలు చెప్పాడు కాని వ్యక్తిగతమైన స్వార్థం కోసం ఆయన అబద్దాలు చెప్పలేదు. కృష్ణుడు ఎప్పుడైనా ఉద్రేకపడినట్లు మనకు కనబడినా ఆ ఉద్రేకంలో కూడా తానెవడో తనకు తెలుస్తూ ఉంటుంది, అదీ మనం గమనించవలసింది. ఉద్రేకం వచ్చినప్పుడు మనం ఆ ఉద్రేకంతో కలిసిపోతాము కాని ఆయనకు ఉద్రేకం వచ్చినప్పుడు కూడా ఆయన ఎవడో ఆయనకు తెలుసు, అది లోపల అనుభవంలో ఉంటుంది.

యిష్టాలవలన, అయిష్టాలవలన చాలా ప్రమాదం. అందుచేత వాటిజోలికి వెళ్ళవద్దు. రజోగుణాన్ని తమోగుణాన్ని తగ్గించుకో. సత్వగుణాన్ని పోషించుకొంటారా. మీ యిష్టాలకోసం, అయిష్టాల కోసం పనులు చేయవద్దు. భగవంతుని దయను సంపాదించటంకోసం పనులు చెయ్యండి. నిరంతరం నీ యోగక్షేమాలకోసం ఆలోచించుకోవద్దు. సమాజ క్షేమంకోసం కొంత ఆలోచించు. కొంతమందికి చనిపోయేటప్పడు కూడా డబ్బుగొడవ, ఆస్తులగొడవ, యిదే గొడవలో ఉంటారుకాని వారికి కృష్ణా, రామ అనేది ఉండదు. కొంతమంది ప్రతీవిషయానికి ఉద్రేకపడతారు అంటే వారి శరీరం పెరుగుతోంది కాని వారికి మనస్సులో

వికాసం లేదు, మనోనిగ్రహంలేదు. మీరు మాట్లాడేటప్పడు వ్యక్తి భావనతో మాట్లాడుతున్నామా, ఆత్మభావనతో మాట్లాడుతున్నామా అని ప్రతీమాటను వాచ్‌చేసుకోండి. మీరు దేహబుద్ధి లేకుండా మాట్లాడితే మీకు ఆత్మజ్ఞానం కలుగుతుంది. వేదాలయొక్క సారం ఏమిటి అంటే ముందు మీరు యింద్రియాలను నిగ్రహించుకోండి, మనస్సును నిగ్రహించుకోండి అని చెపుతున్నాయి. అది మీకు అర్థమైతే ఇంకరోజూ పుస్తకాలు చదవటం దేనికి? యింద్రియనిగ్రహంకోసం, మనోనిగ్రహం కోసం మీరు ప్రయత్నంచేయండి. పుస్తకాలు చదివితే మీకు పాండిత్యం వస్తుంది. యింద్రియనిగ్రహం, మనోనిగ్రహం నేర్చుకుంటే మీకు మోక్షం వస్తుంది. మీకు ఏమైనా బలహీనతలు ఉంటే డబ్బు ఖర్చు అవుతుంది కాని బలహీనతలు లేకపోతే పెద్దగా డబ్బు ఖర్చు అవ్వదు మీకు సినిమాలు చూడటం అలవాటు లేదనుకోండి, భోగాలు అనుభవించాలి అనే కోరిక లేదు అనుకోండి. మీ సంపాదన ఏమి చేసుకోవాలో మీకే తెలియదు. మనిషికి చెడ్డ అలవాటు లేకపోతే పెద్దగా డబ్బు ఖర్చు అవ్వదు. నేనే కర్తను అని భగవంతుడు చెపుతున్నప్పటికీ మనకు కర్తృత్వబుద్ధి పోవటం లేదు. మనలో కర్తృత్వ బుద్ధి ఉన్నంతకాలం దుఃఖం మనలను విడిచిపెట్టదు.

ఇప్పడు చాలామంది ఎలా ఉన్నారు అంటే తల్లిదండ్రులకు సేవ చేసేవారుకూడా ఆ మెడలో గొలుసులను చూసి చేస్తారు, వారికి మెడలో గొలుసులు లేకపోతే టైముకు అన్నం పెట్టరు, కాఫీ ఇవ్వరు. ఇవన్నీ దొంగ ప్రేమలు. ఏసుక్రీస్తు చనిపోయేటప్పడు తల్లిని ఒక శిష్యుడికి అప్పచెప్పాడు. క్రీస్తు తల్లితో ఏమని చెప్పాడు అంటే ఈరోజుతో నా జీవితం సమాప్తం అయిపోతుంది. రేపటినుండి వాడే నీకు కుమారుడు, వాడికి నువ్వు తల్లివి అని చెప్పాడు. తరువాత ఏసుక్రీస్తు తల్లి పదకొండు సంవత్సరాలు జీవించింది. క్రీస్తుకు ఇచ్చిన మాటను పోషించుకోవటం కోసం ఆవిడ చనిపోయేటైములో నేను ఉంటానో ఉండనో అని ఆ పదకొండు సంవత్సరాలు ఊరు విడిచిపెట్టకుండా ఇంట్లోనే ఉంటూ తల్లికి కాపలాకాసాడు, అది చూడటం అంటే, అదీ ప్రేమ అంటే. మీరు నిష్కామకర్మ చెయ్యాలి, దానివలన మీ మనస్సు పవిత్రం అవ్వాలి. ఇవి లేకుండా మీకు విచారణ చేసినా మీకు ఆత్మజ్ఞానం రాదు. పునాదులు లేకుండా ఇల్లు ఎవడు కడతాడు. పునాదులు లేకుండా విచారణ చేస్తే మీకు ఆత్మ అందుతుందా? కర్మ చేసేటప్పడు మీలో ఉన్న బలహీనతలు ఏమిటో మీకు తెలుస్తాయి. కర్మ చేయకుండా ఏవో పాడిపాడి కబుర్లు చెపితే మీలో ఉన్న బలహీనతలు మీకు తెలియవు. ముందు కర్మ రంగంలో రాణించాలి. కర్మ చేయకుండా కూర్చొంటే మీకు సోమరి తనం

వస్తుంది కాని మీకు ఆత్మజ్ఞానం రాదు. మీ శరీరంలో శక్తి ఉన్నంతకాలం మీరు పనిచేస్తూనే ఉండాలి. మీ మనస్సు పరిశుద్ధమైతే మీరు జ్ఞానాన్ని కోరుకోనక్కరలేదు, జ్ఞానమే వచ్చి మిమ్మల్ని వరిస్తుంది.

బుద్ధి కర్మానుసారిణి అంటే యిది రామాయణంలో వస్తుంది. కైక భరతుడి కంటే రాముడిని ఎక్కువగా ప్రేమించేది. రేపు పట్టాభిషేకం అనగా ఆవిడ బుద్ధి మారిపోతుంది. మంధర చెప్పిన మాటలు విని కైకబుద్ధి మారిపోయింది అని మనం అనుకొంటున్నాము. మంధర చెప్పినంతమాత్రం చేత కైకబుద్ధి మారాలని ఎక్కడ ఉంది. మంధర చెప్పినా కైక వినకూడదు కదా. కైకబుద్ధి మన కర్మానుసారం తిరుగుతోంది లక్ష్మణా అంటాడు రాముడు. కైకకు యింతవరకు మన మీద ఎంతో ప్రేమ ఉంది, ఇప్పుడు సడెన్‌గా ద్వేషం వచ్చి మనలను అడవికి పొమ్మంటోంది. ఒకవేళ ఈ శరీరం ద్వారా అడవిలో చేయవలసిన పని ఉందేమో దానిని బట్టి కైకబుద్ధి మారుతోంది. మన శరీరాలు ఎందుకు వచ్చాయో దానిని అనుసరించి కైకకు ఆ బుద్ధి కలిగింది, అందుచేత ఈ విషయంలో ఆగ్రహం వద్దు. దేవుని సంకల్పమే నెరవేరుతుంది అని చెప్పాడు. నువ్వు నీ ఇష్టం వచ్చినట్లు అనుకోవచ్చు, నువ్వు అనుకొన్నది నెరవేరదు, దేవుడి సంకల్పమే జరుగుతుంది. రమణమహర్షిగారు తల్లికి చెప్పింది అర్థమైతే మనం ఎన్ని కష్టాల మధ్యన ఉన్నా మనకు దుఃఖం రాదు. ఈశ్వరుడు జీవులను వారి వారి ప్రారబ్దంననుసరించి ఆడిస్తున్నాడు. జరుగవలసినది జరిగే తీరును, జరుగరానిది ఎవరు ఎంత ప్రయత్నం చేసినా జరుగనే జరుగదు, యిది నిశ్చయము అని చెప్పారు. భారతదేశంలో చాలా క్షేత్రాలు ఉన్నాయి. అయితే నా దేహప్రారబ్ధం ప్రకారం ఇది అరుణాచలంలో ఉండవలసి ఉంది. అది ఈశ్వరాజ్ఞ. ఏ మనిషీ స్వతంత్రుడు కాదు, అందరూ ఈశ్వరుని చేతిలో కీలుబొమ్మలు. ఆయన ఎలా ఆడిస్తే అలా ఆడవలసిందే. నీకు పనిచేయటానికే అధికారం ఉంది. నువ్వు పనిచేయ్యటానికే యిక్కడ పుట్టావు. ఒకవేళ నువ్వు బద్ధకించినా భగవంతుడు నీ చేత ఆ పనిచేయిస్తాడు. అందుచేత భగవంతుడు నీకు కేటాయించిన పనిని యిష్టంతో చెయ్యి. ఇక్కడ కృష్ణుడు గొప్ప రహస్యం చెప్పాడు. యిప్పుడు మీ అత్తగారికి కాఫీ ఇవ్వాలి అనుకో. అయిష్టంతో ఇవ్వకు, ఇష్టంతో ఇయ్యి. నువ్వు ఏపని చేసినా యిష్టంతో చెయ్యి. ఇలా చెయ్యటం వలన పాత వాసనలు పోతాయి. కొత్త వాసనలు రావు. యిది మనం నేర్చుకోవాలి. మీరు ఆ మనుషుల మీద ఎంత యిష్టం లేకపోయినా వారికి సేవ చేసేటప్పుడు యిష్టంగానే చేయండి. అలా పనిచెయ్యటం వలన పునర్జన్మహేతువులు నశిస్తాయి.

చేపలు నదీప్రవాహానికి ఎలా ఎదురీదుతాయో అలాగే మీ మనస్సుయొక్క ప్రవాహానికి ఎదురు ఈదితే మీరు మనోమూలంలోనికి వెళ్ళిపోతారు. మనోమూలంలోనే భగవంతుడు ఉన్నాడు అంటే మీరు భగవంతుడిని చేరుకొంటారు. నీ చేతిలో ఉన్న పనిని శ్రద్ధగా చెయ్యి, నీ చేతిలో లేని పని గురించి ఆలోచించవద్దు. మేము వందకోట్లు సంపాదించాలని మీరు అనుకొంటున్నారు అనుకోండి వంద కోట్లు మీరు సంపాదించగలుగుతున్నారా? లేదు. ఆ కోరిక మీకు ఎంత బలంగా ఉన్నా అది మీకు శక్తిని యివ్వదు. శక్తిని యిచ్చేవాడు భగవంతుడు. ఆయన నిర్ణయిస్తే ఆ పని మీ ద్వారా జరుగుతుంది కాని మీరు ఎంత ప్రయత్నం చేసినా అది అవ్వదు. నీకు ఫలం వచ్చే యోగం ఉంటే వస్తుంది లేకపోతే నువ్వు ఆశించినా రాదు. అంటే నీకు ఆ యోగ్యత లేకపోతే బంగారపుకొండ మీద నువ్వు అటూ ఇటూ దొర్లినా నీ ఒంటకి మటుకు బంగారం అంటుకోదు. అందుచేత వారిలా మనం ఉండాలి, వీరిలా మనం ఉండాలి అని అనుకోవద్దు. అనుకరణ పనికిరాదు. మనం మనంలాగే ఉంటాము. ఇదంతా నేనే సాధించాను అని ఎప్పుడూ అనుకోవద్దు. ఒకవేళ మీరు ఎంత కష్టపడిని ఈశ్వరుని సంకల్పం ఉంటే అది వస్తుంది లేకపోతే రాదు.

పనిచెయ్యి, ఫలితం కోసం ఎదురుచూడకు. సమానభావన పెట్టుకొని పనిచెయ్యి. సమానబావన అంటే ఇక్కడ ఏమిటంటే కర్మఫలం వచ్చినా, రాకపోయినా నువ్వు ఒకేరకంగా ఉండాలి. నువ్వు చేసేపని ఓర్పుగా, నేర్పుగా చెయ్యాలి. సహనం విడిచిపెట్టకూడదు. యాక్షన్ ఉండాలి కాని రియాక్షన్ ఉండకూడదు. క్రమశిక్షణ లేని మనిషి ఈ లోకానికి పనికిరాడు, పరలోకానికి పనికిరాడు. నీకు జయం వచ్చినా, అపజయం వచ్చినా నీ బేలెన్స్ పోకుండా పనిచేయటం నేర్చుకో. అంటే నువ్వు సమానంగా ఉండాలి. ఇతరులు నిన్ను మంచిగా అనుకొన్నా, చెడుగా అనుకొన్నా నీ చేతిలో ఉన్న పనిని పెర్ఫెక్ట్‌గా చెయ్యి. నువ్వు కర్మను ఓర్పుగా, నేర్పుగా చేస్తే, కర్మఫలం ఆశించకుండా చేస్తే అది నిన్ను అమృతత్వం వైపుకు తీసుకొని వెళ్తుంది. మన శవాలు ఈ భూమి మీద తిరుగుతున్నప్పుడే అమృతానుభవం కనుక పొందితే ముగింపు లేని శాంతిని, ఆనందాన్ని, సుఖాన్ని పొందుతాము.

మీరు ఎవరికైనా పది రూపాయలు కావాలంటే యిస్తారు. ఏదైనా పని గురించి అడిగితే ఆ పని పురమాయిస్తారు. శాంతి, సుఖం గురించి అడిగితే మీరు ఎలా ఇవ్వగలరు, అసలు అది మీ దగ్గర ఉంటే కదా ఇతరులకు ఇవ్వటానికి? మీ దగ్గర ఏదైనా ఉంటే అది ఇతరులకు ఇవ్వగలరు కాని మీ దగ్గరే లేనప్పుడు ఇతరులకు ఏమి ఇస్తారు? మీకు వస్తువు

అనుభవంలో లేనప్పుడు మీరు చెప్పే మాటలు ఇతరుల బుర్రని పాడుచేస్తాయి. వస్తువు అనుభవంలో లేకుండా రామకృష్ణుడి దగ్గర ఎవరైనా మాటలు చెపుతూ ఉంటే వారిని ఆపమని చెప్పేవారు కాదు. నువ్వూ మొదలుపెట్టేశావా! నీకు శాంతి లేదు, సుఖం లేదు. ఇంటి దగ్గర ఏడవటం మానేసి రోడ్డు మీద ఏడుస్తావా? నువ్వు చెప్పే మాటలకు అసలు నీకు అర్థం తెలుసా? ఏవో పుస్తకాలు చదివి ఇక్కడ కక్కేస్తావా? అప్పుడే టీచింగ్ మొదలుపెట్టావా? ఆ మాటలు చెప్పమని ఎవడు నీకు అధికారం ఇచ్చాడు. ఈ దుకాణం ఓపెన్ చేయమని ఎవడు నీకు చెప్పాడు అనేవారు.

మన ఇంటిలో ముసలివారు ఉంటే ఏవో మంచిమాటలు చెపుతూ ఉంటారు. వారు పుస్తకాలు చదవకపోయినా జీవితం నేర్పిన పాఠాలు వారికి ఉంటాయి, అవి మనకు చెపుతూ ఉంటారు. అవసరం లేని ఖర్చులు చేయవద్దు, పాడుస్నేహాలు చేయకండి అని మన క్షేమం కోరి ముందు జాగ్రత్తకోసం ఈ మాటలు చెపుతూ ఉంటారు. మీరు చెప్పింది చాలు, ఇంక ఊరుకోండి అని మనం అంటాము. మంచి మాటలు చెప్పటం మాకు అలవాటు అయిపోయింది. చెప్పకుండా ఉండలేక చెపుతున్నామురా అబ్బాయి అని వారు అంటారు. మీరు కష్టపడి డబ్బు ఎలా సంపాదించుకొంటున్నారో అలాగ మంచిగుణాలను సంపాదించుకుంటే అంటే గుణసంపదను మీరు సంపాదించుకొంటే ఏ రకమైన వికారము లేని పదవిని పొందుతారు. అంటే జీవించటానికి, చనిపోవటానికి బేధంలేని స్థితిని పొందుతారు. అంటే ఈ శరీరం ఉన్నా, ఈ శరీరం మరణించినా కూడా మనం ఉంటాము అనే అనుభవం మనకు కలుగుతుంది.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 07-01-2013, మురమళ్ళ)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

హిందూమతంలో టీచింగు ఎక్కువ అవసరం. యజ్ఞాలు, యాగాలు మన మతంలో ఒక భాగమే కానీ టీచింగు పూర్తిగా తగ్గిపోయింది. క్రిస్టియన్ మతంలో టీచింగు ఎక్కువ ఉంది. అందుకే ఆ మతం అభివృద్ధి అవుతోంది. హిందూమతంలో యజ్ఞాలు, యాగాలతో పాటు టీచింగు కూడా ఎక్కువగా పెంచాలి.

మనకి రెండు శరీరాలు ఉన్నాయి. మెంటల్ బాడీ, ఫిజికల్ బాడీ. మన శరీరాన్ని స్థూలశరీరము అంటారు. మనస్సుని సూక్ష్మశరీరం అంటారు. రోజూ ఫిజికల్ బాడీకి స్నానం

చేయిస్తున్నాము కాని మెంటల్‌బాడీకి స్నానం లేదు. అంటే జపధ్యానాలు, విచారణ, నామ స్మరణని విడిచిపెట్టాసాము. మనకు భగవంతుడియందు గౌరవంలేదు, భగవంతుడి గురించి చెప్పేవాళ్లకు కూడా భగవంతుడియందు గౌరవం లేదు. అసలు భగవంతుడు అనేవాడు ఒకడు ఉన్నాడు అనే విశ్వాసం ప్రజలలో తగ్గిపోతోంది. మీరు ఇంటి దగ్గర వంట పనులు ఎలా చేసుకుంటున్నారో అలాగే మనస్సుని పరిశుద్ధం చేసుకోవటం అనేది ఒక పనికింద పెట్టుకోవాలి. మనిషి చనిపోతే స్మశానంలో శరీరం కాలిస్తే బూడిద అవుతుంది, కప్పెడితే మట్టి అవుతుంది. మార్పు స్థూలశరీరానికే, సూక్ష్మశరీరం అలాగే ఉండిపోతుంది. ఆ సూక్ష్మ శరీరంలో గుణాలు, వికారాలు, ఇంద్రియాలకి సంబంధించిన విషయాలు ఉంటాయి. ఈ సూక్ష్మశరీరం కాలదు. అక్షరమణమాలలో భగవాన్ అన్నారు "ఈ భౌతికమైన శరీరం భౌతికమైన అగ్నికి కాలి బూడిద అవ్వకముందే నాలో ఉన్న బలహీనతల్ని, నా బుద్ధిలో ఉన్న దోషాలని అన్నింటినీ కూడా నీ అనుగ్రహాన్ని, నీ దయను, నీ జ్ఞానాగ్నిని పంపించి కాల్చి బూడిద చెయ్యి అరుణాచలేశ్వరుడా" అన్నారు. శరీరం పోయిన తరువాత మీ కూడా వచ్చే సూక్ష్మశరీరాన్ని బాగుచేసుకోవటానికి, మీతలమీద ఉన్న వెంట్రులకి ఇచ్చే విలువకూడా ఇవ్వటం లేదు. దేహానికి చిన్న అనారోగ్యం వస్తే పది హాస్పటల్స్‌కి తిరుగుతున్నాము. మనస్సు పాడైపోతోంది అంటే మీరు ఏమైనా పట్టించుకుంటున్నారా? ఎందుచేతనంటే మనస్సుని పవిత్రం చేసుకోవాలి, ఏకాగ్రం చేసుకోవాలి అని మీకు అసలు సంకల్పం లేదు. మనస్సుకి సంబంధించిన సబ్జక్టు శ్రవణం చేయటంలేదు. మేము వచ్చి ఇక్కడ ఊరికే పాండిత్యం చెప్పి వెళ్ళిపోతే ఎందుకు? దానివలన మీ మనస్సు బాగుపడాలి కదా. లేకపోతే ఈ బోధ ఎందుకు? గుణసంపద లేనప్పుడు తత్వం చెబితే అర్థం అవుతుందా? అసలు చెప్పేవాడు వాడి అహంకారాన్ని ప్రదర్శించటానికి చెబుతున్నాడా? మీరు బాగుపడటానికి చెబుతున్నాడా? మనస్సుని పరిశుద్ధం చేసుకోవటానికి మనం తగిన ఏర్పాట్లు చేసుకోవాలి. దానికి మన ప్రయత్నం ఒక్కటే సరిపోదు. ఈశ్వరుడు మనలో అంతర్యామిగా ఉన్నాడు. నేను అన్నీ జయించాను అంటే ఆయన నమ్మడు. ఎందుచేతనంటే ఇంద్రియాలకి సంబంధించిన విషయాలని మనం వదిలేసినా అవి మన మనస్సులో సూక్ష్మంగా ఉంటాయి. మళ్ళీ అవి ఎప్పుడైనా విజృంభించవచ్చు. అవి ఈశ్వరుడికి తెలుసుకానీ ఈ సాధకుడికి తెలియవు. అందుచేత లోపలఉన్న అంతర్యామి యొక్క అనుగ్రహం లేకుండా ఎవడూ మోక్షం పొందలేడు. అదే స్వప్రయత్నం, కాలపరిపక్వం, ఈశ్వరకటాక్షం. మీరు ఈ సూత్రాలు పాటించాలంటే దీనికి చాలా పట్టుదల ఉండాలి.

చదువుల యొక్క లక్ష్యం ఏమిటి అంటే ఆ సబ్జక్టులో ఉన్న ఇన్ఫర్మేషన్ తీయటమేకాదు ఏకాగ్రత, పవిత్రత, మనం చేసే పనిలో నైపుణ్యం సంపాదించటం ఎడ్యుకేషన్ యొక్క లక్ష్యం. సోక్రటీసు ఏమని చెప్పాడు అంటే "నువ్వు చీకటిలో ఉన్నావు. ఆ చీకటిలో నుండి నిన్ను వెలుతురు లోనికి పంపటమే విద్య యొక్క లక్ష్యం" అన్నాడు. "నువ్వు ఇప్పుడు చీకటిలో ఉన్నావు కాబట్టి నువ్వు ఎవరివో నీకు తెలియటంలేదు. నువ్వు ఏదిగా ఉన్నావో ఆ వస్తువు నీకు అనుభవంలోనికి వస్తే నువ్వు వెలుతురులోనికి వస్తావు" అన్నాడు సోక్రటీసు. మనం మంచిని పెంచుకుంటూ చెడ్డని తగ్గించుకుంటూ రావాలి. మీ ప్రారబ్ధాన్ని బట్టి చదువు రానివ్వండి, ధనం రానివ్వండి. అవి వస్తూ ఉంటాయి, పోతూ ఉంటాయి. దేనినీ చూచి మీరు గర్వం తెచ్చుకోవద్దు. చదువు యొక్క ప్రయోజనం కేవలం డబ్బు సంపాదనే కాదు. చదువు యొక్క ప్రయోజనం నువ్వు ఉన్నతస్థితిని పొందాలి. "నువ్వు ఎంత చదువు చదువుకున్నా మూర్ఖత్వం విడిచిపెట్టనప్పుడు చదువుకున్న మూర్ఖుడవే" అన్నారు భగవాన్. విద్య యొక్క లక్ష్యం ఏమిటి అంటే నీ మనస్సుని అంతర్ముఖం చేయటానికి, నువ్వు సమాజానికి ఎంతోకొంత సహాయ సహకారాలు అందించటానికి, నువ్వు పవిత్రుడవు అవ్వటానికి, ఏకాగ్రత సంపాదించటానికి విద్య నీకు సహకరించాలి. మీరు ఎంత చదువుకున్నా మీకు వినయం రాకపోతే ఆ చదివిన చదువు మీకు జీర్ణం అవ్వలేదని, అవగాహన కాలేదని అర్థం. మీరు వినయాన్ని ప్రాక్టీసు చేస్తేనే ఆధ్యాత్మికత వస్తుంది.

మనం నోటితో తినేదే ఆహారం అనుకుంటున్నాము అదేకాదు మనం చెవులతోటి ఎటువంటి మాటలు వింటున్నాము, కళ్ళతోటి ఎటువంటి దృశ్యాలు చూస్తున్నాము ఇదంతా మన మనస్సుకు ఆహారం. ఎవరైనా అనవసరపు మాటలు మాట్లాడుతున్నారు అనుకోండి వెంటనే మనం లేచి వచ్చేయాలి. అటువంటప్పుడు అబద్ధం చెప్పినా పాపంలేదు. చెడ్డ సాహిత్యం చదవకూడదు, వినకూడదు. మీరు భోజనం విషయంలో ఎంతశ్రద్ధగా ఉంటారో, మీరు బాగుపడటానికి అంతకి రెట్టింపు సాధన చేస్తేకాని మీరు బాగుపడరు. మీ హృదయం యొక్క లోతులు పెరగవు. లౌకికులతోటి స్నేహం చాలా ప్రమాదం. వాళ్ళు ఇహానికి ఉపయోగపడరు, పరానికీ ఉపయోగపడరు. సాధన చేసేవాళ్ళు, భగవదనుభవం పొందాలి అనుకునేవాళ్ళు టివిలు, సినిమాలు చూడకూడదు. మీరు అన్ని ఇంద్రియాలు జయించారనుకోండి, ఏదైనా ఒక ఇంద్రియానికి సంబంధించినటువంటి బలహీనత ఉంది అనుకోండి ఆత్మానుభవం మీరు పొందలేరు. అందుచేత మెయిన్ మనకి సాధన

ఏమిటి అంటే మన బుద్ధి పాడవ్వకుండా చూసుకోవాలి.

ఈ లోకంలోకాని, పరలోకంలోకాని ఒక్కటే నిజం. అది మన అంతర్యామి. నేను మీకు తత్వం చెప్పేసి వెళ్ళిపోతే సరిపోదు. మీరు బాగుపడాలి. లేకపోతే మేము జిన్నూరు నుంచి ఇంతదూరం రావటం ఎందుకు? మాకు పనేమిటి? ఆధ్యాత్మికంగా మీకు స్టేటస్ రావాలి. అదే మా ధ్యేయం. మీరు శరీరం విడిచిపెట్టిన తరువాత కాదు, మీ శరీరం ఈ భూమిమీద ఉండగానే మీరు ఆత్మసుఖం పొందాలి. ఒక్క ఆత్మసుఖం తప్పించి మిగతావన్నీ టెంపరరీయే. మన మనస్సుకి వచ్చే సంతోషాలు, ఇంద్రియాలు అనుభవించే భోగాలు ఇవన్నీ టెంపరరీయే. బుద్ధుడు అంటాడు "క్షణం, క్షణం, క్షణం." మీరు అనుభవించే సుఖాలు ఒక్క క్షణంలో వస్తాయి. ఒక్క క్షణంలో వెళ్ళిపోతాయి. మీకు 80 ఏళ్ళు వచ్చినా, వంద ఏళ్ళు వచ్చినా ఒక్కసారి వెనక్కి తిరిగి చూచుకుంటే ఒక్క క్షణంలో మీ జీవితం వెళ్ళిపోయినట్టు ఉంటుంది. శరీరము, ఇంద్రియాలు, మనస్సు, వ్యక్తీభావన వీటిని అతిక్రమణ చేయకుండా ఎవరూ మోక్షసుఖాన్ని పొందలేరు. మీరు అందరూ జీవన్ముక్తులు అవ్వాలి. జీవన్ముక్తులు అవ్వటం అంటే మాటలతోటి అవుతారా? జీవన్ముక్తులు అవ్వటానికి తగిన కృషి ఉండాలి. మనం బట్టలు కొనుక్కున్నప్పుడు ఆ వెల చెల్లిస్తేనే వాడు బట్టలు ఇస్తాడు. అలాగే మనం తగిన కృషి చేస్తేనే జీవన్ముక్తులు అవ్వటానికి సాధ్యమవుతుంది.

ఎవరైనా ఏదైనా చెప్పినా సొంత ఆలోచన ప్రతీవాడికీ అవసరం. మనకి కాళ్ళు ఇచ్చాడు నడుస్తున్నాం. చేతులు ఇచ్చాడు పనిచేసుకుంటున్నాం, కళ్ళు ఇచ్చాడు చూస్తున్నాం. మరి బుద్ధి ఎందుకు ఇచ్చాడు? బుద్ధిని ఆలోచించుకోవటానికి ఇచ్చాడు. మనకి సొంత ఆలోచన పెరగాలి. అన్ని ఇంద్రియాలకంటే బుద్ధికి సోమరితనం అంటే ఇష్టం. మీకు ఒక విషయాన్ని చెప్పి ఇది అర్థం చేసుకోండి అంటే బుద్ధి అంగీకరించదు. మీరు సినిమా ఎంత ఆసక్తిగా చూస్తున్నారో, బుద్ధితోటి అంత ఆసక్తిగా ఆలోచించగలరా? ముందు బుద్ధికి సోమరితనం పోగొట్టాలి. బుద్ధితో మీరు బేలెన్స్‌డ్‌గా ఆలోచించాలి. న్యాయం చెప్పేవాడు, వాడు జాగ్రత్తగా ఆలోచించి చెప్పకపోతే అన్యాయం చెబుతాడు. భగవద్గీతలో చెప్పిన వాక్యాలను మన మనస్సు నమ్మినట్టు నటిస్తుంది కానీ నమ్మదు. ఎందుచేతనంటే మనకి అనుభవం లేదు. పెద్దల దగ్గర శ్రవణం లేదు. సత్పురుషుల సహవాసం లేదు. బుద్ధిలో ఉన్నదంతా దుమ్మే. అందుచేత భగవద్గీత చదివినా భగవంతుడు తన హృదయాన్ని మీకు ఇవ్వడు.

జీవన్ముక్తి అని, విదేహముక్తి అని శాస్త్రంలో చెప్పారు. మీ శరీరం ఈ భూమి మీద తిరుగుతూ ఉండగానే మీ హృదయంలో ఉన్న సద్వస్తువు మీకు అనుభవంలోనికి వస్తే మిమ్మల్ని జీవన్ముక్తులు అంటారు. కొంతమందికి దేహాన్ని విడిచిపెట్టే టైములో ఆ సద్వస్తువు అనుభవంలోనికి వస్తుంది వాళ్ళని విదేహముక్తులు అంటారు. బైబిలులో ఏసు ఏమని చెప్పాడు అంటే అయామ్ దట్ అయామ్ అన్నాడు. భగవాన్ ఈ వాక్యం చదివి పొంగిపోయారు. అది ఒక మతానికో, ఒక కులానికో, ఒక ప్రాంతానికో సంబంధించినది కాదు. "నేను ఉన్నాను ఆ ఉన్నదేదో నేనై ఉన్నాను." ఇది రోజూ మీరు మననం చేసుకోండి. మీకు ఆధ్యాత్మిక బలం వచ్చేస్తుంది. మీకాళ్ళమీద మీకు నిలబడే ధైర్యం కలుగుతుంది. ముక్తి అంటే అది సుఖస్వరూపం, శాంతిస్వరూపం. మీరు అందరూ జీవన్ముక్తి సుఖం పొందాలి. లోపల ఉన్న సుఖసముద్రం, ఆనందసముద్రం పొంగి మీ సహస్రారాన్ని ముంచేస్తూ ఉంటే మీరు భరించలేరు. ఒకోసారి ప్రాణం కూడా పోవచ్చు. అప్పుడు భగవంతుడు ఏమి చేస్తాడు అంటే నీకు ప్రాణం పోకుండా నెమ్మదిగా కుళాయి విడిచిపెట్టినట్టు విడిచిపెడుతూ ఉంటాడు. నువ్వు భరించలేనప్పుడు అది తగ్గిస్తూ ఉంటాడు. నీకు అలవాటు అయిన తరువాత పూర్తిగా ఆనందాన్ని, శాంతిని విడిచిపెడతాడు. అప్పుడు నీకు శరీరము, మనస్సు, లోకం అన్నీ తలంపులే అని తెలుస్తుంది. నీ సుఖం తలంపు, నీ దుఃఖం తలంపు, నీ పుట్టుక తలంపు, నీ చావు తలంపు అని ఏ పుస్తకం చదివినా, ఎవరు చెప్పినా మీరు నమ్మరు. హృదయంలో ఉన్న ఆనందం మనకి అనుభవంలోనికి వచ్చినప్పుడు అన్నీ తలంపులే అని మీకు తెలుస్తుంది. అది వైభవం.

మీకు ఏదైనా కష్టం వచ్చినా కంగారుపడకండి. ఒక కాలం కష్టం తీసుకువస్తుంది. ఒక కాలం సుఖం తీసుకువస్తుంది. ఇవన్నీ టెంపరరీయే. అమావాస్యచీకటి ఎలా ఉంటుందో అంత దట్టమైనటువంటి ఇబ్బందులు మీరు పడుతున్నప్పటికీ మళ్ళీ ఆ చీకటిని చీల్చుకుని సూర్యుడు ఎలా ఉదయిస్తాడో అలా మళ్ళీ మీ జీవితాలు కూడా వెలుగుతోటి నింపబడతాయి. మీరు తొందరపడకండి. వెయిట్ అండ్ సీ. గుళ్ళు, గోపురాలు ప్రపంచంలో ఎక్కడ ఉన్నా ఇవన్నీ మానవుడు నిర్మించినవే. కానీ హృదయంలో ఉన్న అంతర్యామిని ఎవరూ నిర్మించలేదు. ఈ పంచభూతాలని నడిపేవాడు, నీకూడా ఉండి నీ దేహప్రారబ్ధాన్ని బట్టి నిన్ను నడిపేవాడు ఆయనే. నువ్వు పొందవలసిన అనుభవాలు పొందేవరకూ నువ్వు తినవలసిన మొట్టికాయలు ఏమైనా ఉంటే అవి అన్నీ తినేవరకూ నీ శరీరానికి జరగవలసిన

ఊరేగింపులు ఉంటే అవి జరిగే వరకూ నిన్ను ఈ శరీరంలో ఉంచుతాడు. ఇవన్నీ దేహప్రారబ్ధం కొట్టే దెబ్బలు. తరువాత నిన్ను బయటకు లాగేస్తాడు. పంచభూతాలని, జీవకోటిని నియమించే వాడు ఈశ్వరుడు. వాడు నియంత. వాడు ఒక్కడే నిజం.

మీరు సాధనపేరుతోటి రూపబుద్ధి, నామబుద్ధి పెంచుకొంటే అది సాధన అవుతుందా? ఇచ్చిన 5 రూపాయలకే పెద్ద పెద్ద పేర్లా? అంటే నువ్వు రూపబుద్ధితోటి, నామబుద్ధితోటి ఆ పని చేస్తున్నావు. రూపబుద్ధి పెరిగేవాడు, నామబుద్ధి పెరిగేవాడు అంతర్యామికి దూరమవుతాడు. నదివెళ్ళి సముద్రంలో ఎంత ప్రశాంతంగా కలుస్తుందో అలా నువ్వు కూడా నీ రూపబుద్ధిలోంచి, నామబుద్ధిలోంచి విడుదల అయితేగాని అంతర్యామిలో ఐక్యం కాలేవు. నువ్వు శరీరంతోటి పొరపాటు చెయ్యకపోవచ్చు. మనస్సులో పొరపాటు చేసినా అంతర్యామి గ్రహిస్తాడు. డోంట్ ఫర్‌గెట్ ఇట్. ఎందుచేతనంటే ఆయన ఎక్కడో గుడిలో లేడు, మనలో అంతర్యామిగా ఉన్నాడు. నీ హృదయంలో అంతర్యామిగా ఉన్నవాడి దగ్గరినుంచి నువ్వు ఎలా పారిపోగలవు? కర్మఫలదాత అంతర్యామి. నువ్వు ఫలం కోరుకోకుండా చేస్తున్నావా? ఫలితం కోరుకుంటున్నావా? అని అంతర్యామి చూస్తాడు. అంతర్యామి కళ్ళులేకుండా చూస్తాడు. చెవులు లేకుండా వింటాడు. చేతులు లేకుండా పని చేయగలడు. అంతర్యామి శరీరం లేకుండా పనిచేస్తాడు. వాడు అంతర్యామి.

ఈ లోకంలో పాపం అంటూ ఏమీ లేదు. ఇట్ ఈజ్ ఎటాచ్‌మెంట్ ఓన్లీ. నీకు మమకారం ఉంటే పాపం చేస్తావు కానీ, నీకు మమకారం లేకపోతే పాపం చేయవలసిన పనిలేదు. మీ బుర్రకి పట్టేలాగ మాట్లాడటానికి ఇంత వాయిస్ పెంచి మాట్లాడుతున్నాం. లేకపోతే మైక్ ఉండగా ఇంత గట్టిగా అరవటం ఎందుకు? నెమ్మదిగా చెప్పవచ్చు కదా! గట్టిగా చెబితే మీ బుద్ధికి పడుతుందని చెబుతున్నాను. ఎన్ని బలహీనతలు ఉన్నా ఈశ్వరుని దయ ఉంటే గడ్డికి నిప్పు పెడితే అప్పటికప్పుడు ఎలా కాలిపోతుందో అలా వెంటనే మీ బలహీనతలు కాలిపోతాయి. నువ్వు ఏది చేసినా ఈశ్వరుని దయ సంపాదించటానికి ప్రయత్నం చెయ్యి. అహంకారం లేకుండా, మమకారం లేకుండా ఈశ్వర ప్రీత్యర్థం నువ్వు పని చేస్తూ ఉంటే ఈశ్వరుని దయ వస్తుంది. మీకు అంతర్యామి అనుగ్రహం లేకుండా భగవద్గీత చదివినా అది మీకు అర్థంకాదు. ప్రపంచంలో ఎవరు నాకు బాగా సన్నిహితులు? ఎవరు నా హృదయానికి దగ్గరగా ఉంటారు? ఎవరిని నేను ఎక్కువ ప్రేమిస్తున్నాను? అని కృష్ణుడు అర్జునుడిని అడిగి మళ్ళీ ఆయనే చెబుతాడు "ఈ భగవద్గీతని బాగా అధ్యయనం

చేసి అర్థం చేసుకొని, అనుభవైకవేద్యం చేసుకుని ఇతరులకు అర్థమయ్యేలా చెప్పగలిగితే ఇతరులకు కూడా శ్రద్ధ కలిగేలాగ, గీతని అధ్యయనం చెయ్యాలనే బుద్ధి కలిగేలాగ చెప్పగలిగితే అటువంటి వ్యక్తి నా హృదయానికి సమీపంలో ఉంటాడు అర్జునా!" అన్నాడు పరమాత్మ.

మీరు ఎవరిపట్ల ద్వేషం పెట్టుకోవద్దు. ఇతరులు మీకు అపకారం చేసినా, వాళ్ళని ద్వేషించే కారణాలు ఉన్నప్పటికీ మీరు ద్వేషం లేకుండా ఉంటే అప్పుడు అంతర్యామి మిమ్మల్ని అనుగ్రహిస్తాడు. కేవలం తెలివితేటల వలన, నీ సాధన వలన ఆ వస్తువును పొందలేవు. ఎవడైతే అంతర్యామిగా ఉన్నాడో వాడి దయలేకుండా రవ్వంత, ముల్లంత కూడా నువ్వు అంతర్ముఖం అవ్వలేవు. మీ మనస్సును బాహ్యముఖం చేసేమాటలు వినవద్దు. కళ్ళతోటి చూడవద్దు. నోటితోటి మాట్లాడవద్దు. అప్పుడు మనస్సు బాగుపడుతుంది. మనస్సు బాగుపడితేకాని, మనస్సు పవిత్రం అయితేగాని, మనస్సు ఏకాగ్రం అయితేగాని అది అంతర్ముఖం అవ్వదు. స్థూలమైన మనస్సు అంతర్ముఖం అవ్వదు. సూక్ష్మాతి సూక్ష్మమైన మనస్సు మాత్రమే అంతర్ముఖం అవుతుంది. అది అంతర్యామిని పొందుతుంది. నువ్వు మౌనం ద్వారానే లోపల ఉన్న బ్రహ్మములోనికి వెళ్ళాలి. డబడబలు కుదరవు. వాక్కుమౌనం కాదు, మానసిక మౌనం నీకు కుదిరితే హృదయ గుహలో నువ్వు ప్రవేశించగలవు. మానసికమౌనం నీకు నేర్పటానికే వాక్కుమౌనం కూడా భగవంతుడు పెట్టాడు. మానసిక మౌనం నేర్చుకున్నవాడు మాత్రమే హృదయంలో ప్రవేశించగలడు. మీరందరూ ఆ స్థితిని పొందాలి.

ఏ మనిషికీ పొరపాటు మాట్లాడాలని ఉండదు, పొరపాటు చెయ్యాలని ఉండదు. కానీ అందరూ పొరపాట్లు చేస్తున్నారు కారణం ఏమిటి అని అడిగితే కామక్రోధాలు అని కృష్ణుడు చెప్పాడు. కోరిక, కోపము ఈ రెండూ ఉన్నవాడు ఎంత జాగ్రత్తగా ఉన్నా పొరపాటు మాటలు వచ్చేస్తాయి. మీకు అనుకూలపరిస్థితులు వస్తే పొంగిపోకండి. మీకు ప్రతికూల పరిస్థితులు వస్తే కృంగిపోకండి. కొంతమంది అంటారు "మాకు ఎటువెళ్ళినా శనిగాడేనండి, ఎటువెళ్ళినా మాకు పనులు అవ్వటం లేదు" అంటారు. అటువంటి పరిస్థితులు కొంతకాలం పెట్టి తలుపు సందులో పెట్టి మిమ్మల్ని నొక్కుతాడు భగవంతుడు. అప్పుడు కూడా మీరు బేలెన్స్‌డ్‌గా ఉంటున్నారో లేదో చూస్తాడు. మీకు జ్ఞానం ఇచ్చేముందు కొన్ని పరీక్షలకి గురిచేయకుండా మీకు ఇవ్వడు. వీళ్ళకి సంతోషం వచ్చే సంఘటనలో ఎలా ఉన్నారు? దుఃఖం కలిగే సంఘటనలో ఎలా ఉన్నారు? దానిని, దీనిని సమానంగా తీసుకుంటున్నారా? లేదా? బ్రెయిన్ ఎటైనా ఒరిగిపోతోందా? ఇవన్నీ చూసుకొని మీ బ్రెయిన్ బేలెన్స్‌డ్‌గా లేదు

అంటే ఇంక మీకు జ్ఞానాన్ని ప్రసాదించడు. ప్రసాదం అంటే అనుగ్రహం. ఆ ప్రసాదం లేకుండా మనకి చైతన్యానుభవం కలగదు.

సంతోషం వస్తే పొంగిపోకుండా, ఏదైనా సఫరింగ్ వస్తే కృంగిపోకుండా, అవి వికారాలు మాత్రమే అని గ్రహించి ఆ వికారాలు లేకుండా ఉన్నవాడి బుద్ధే స్థిరమౌతుంది. మనస్సులో పవిత్రతలేనివాడికి, ఇంద్రియనిగ్రహం లేనివాడికి బుద్ధి స్థిరంగా ఉండదు. నువ్వు వెయ్యికోట్లు డబ్బు సంపాదించావు. గొప్ప కులంలో పుట్టావు. నీ బుద్ధి బాగాలేదు అనుకో నీ బుద్ధి పాడైన తరువాత నీ కులం ఎవడికి కావాలి? నీ ఆస్థి ఎవడికి కావాలి? బుద్ధి పాడైపోయిన వాడికి ఎన్ని ఉన్నా ఏమీలాభం లేదు. ఒకటి లేని సున్నలు. నీ బుద్ధిని పాడుచేసే జనం దగ్గర కూర్చోవద్దు. నీ బుద్ధిని పాడుచేసే పుస్తకాలు చదవవద్దు. మీ కళ్ళతోటి చెడ్డ దృశ్యాలు చూస్తూ ఉంటే, చెవులతోటి చెడ్డమాటలు వింటూ ఉంటే, చేతులతోటి చెడ్డ పనులు చేస్తూ ఉంటే, నోటితో చెడ్డమాటలు మాట్లాడుతూ ఉంటే నీకు బుద్ధి స్థిరంగా ఉంటుందా? నీ బుద్ధిని స్థిరంగా ఉంచుకోవటానికి అవన్నీ వదులుకో. నీ బుద్ధిని మటుకు పాడుచేసుకోకు. నీ బుద్ధి ఏకాగ్రంగా ఉండాలి, పవిత్రంగా ఉండాలి, స్థిరంగా ఉండాలి.

తాబేలుకి ప్రమాదం వస్తుంది అంటే ఇంద్రియాలు అన్నీ లోపలకు లాగేసుకుంటుంది. పైన పెంకుమీద కొట్టినా అది చావదు. అలాగే మీరు ఏదైనా ప్రమాదంలో పడతాము అనుకున్నప్పుడు మీ ఇంద్రియాలను హృదయంలోనికి ఉపసంహరించుకుంటే మీ బుద్ధికి ఆకర్షణ పోతుంది. ఇక్కడ కృష్ణుడు చెప్పే రహస్యం ఏమిటి అంటే "మీరు ఇంద్రియాలను హృదయంలోనికి లాగేసుకుంటారు అనుకోండి అప్పుడు బుద్ధి స్థిరపడుతుంది. తాబేలు ఇంద్రియాలు లోపలకి లాక్కుంటే ఇంద్రియాలు చచ్చిపోలేదు కదా. మళ్ళీ దానికి భయం పోయినప్పుడు ఇంద్రియాలను బయటకు వదిలేస్తుంది. అలాగే మీకు విషయాలు కాలకుండా లోపల అణచుకుని ఉంచుకుంటే అవి మీ మనస్సులో ఉండిపోతాయి. స్మశానంలో నీ శరీరం కాలిబూడిద అవుతుందికానీ నీ మనస్సులో ఉన్న విషయాలు బూడిద అవ్వవు. అవి సజీవంగానే ఉంటాయి. మరల కొత్త శరీరంలో అవి వచ్చేస్తాయి. మనస్సులో ఉన్న విషయాలు కూడా చచ్చిపోవాలి అంటే నా దయ లేకుండా చచ్చిపోవు అన్నాడు. మీరు వేదాల్ని అధ్యయనం చేయటం వలనకాని, మీ వివేకం వలనకాని, మీ ప్రయత్నం వలన కాని అవి చావవు. నా దయ లేకుండా, నా అనుగ్రహం లేకుండా వాటిని బూడిద చెయ్యలేవు" అన్నాడు పరమాత్మ. ఈ రోజు ప్రవచనం యొక్క సారాంశం ఏమిటి అంటే "బుద్ధిని బాగుచేసుకో."

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| మార్చి | 25 | చించినాడ గీతామందిరం |
| మార్చి | 27 | అర్తమూరు (వయా) మండపేట |
| మార్చి | 30 | తాడినాడ |

With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.

**- Mahabharatha**

## దేహాత్మ బుద్ధే అజ్ఞానం

పరమాత్మ అనగానే మన స్వరూపం కన్నా వేరుగా బాహ్యంగా ఉండే శక్తిగా భావిస్తాం. భగవాన్ శ్రీ రమణమహర్షి జగత్తు, జీవుడు, ఈశ్వరుడు, ఒకే చైతన్యంలో కల్పన అంటారు. ఈశ్వరుడు, జగత్తు ఆత్మకంటే వేరు కాదు. చైతన్యము అనంతము కాబట్టి ఒక వ్యక్తి అంటూ ఎవరూ దానికి భిన్నంగా ఉండే అవకాశం లేదు. 'దేహాత్మ బుద్ధి' వలన జగత్తును, ఈశ్వరుడిని మనకన్నా భిన్నంగా భావించడం జరుగుతోంది. కాబట్టి మనం చేసే సాధన చిత్తశుద్ధికొరకే! దేహాత్మబుద్ధి నుండి విడుదల పొందడానికే! దేహాత్మబుద్ధే అజ్ఞానం, కాబట్టి దానిని పోగొట్టుకోవడానికి చేసే ప్రయత్నమే నిజమైన సాధన. మనం చేసే పనివల్ల దేహాత్మబుద్ధి పెరగకూడదు. మనదృష్టి విషయ వస్తువుల మీద, భోగముల మీద కాకుండా స్వరూప చైతన్యం మీద నిలపాలి. మన సాధన, అధ్యయనాలు, తలంపు, మాట, చేత, మనలోని వివేకాన్ని పెంచి, మన ప్రగతికి అనగా స్వరూప ఎరుకలోకి మేల్కొనుటకు సహాయపడాలి. మన ఆధ్యాత్మిక ప్రయాణంలో అసహనం పెద్ద అవరోధం, కాబట్టి ఎల్లప్పుడూ శాంతచిత్తులమై ఉండాలి. శాశ్వతమైన శాంతిని, అమృతస్థితిని ఆశిస్తూ తాత్కాలిక విషయ భోగాలను వాంఛించడం మనలోని లోపాన్ని, అవివేకాన్ని స్పష్టం చేస్తుంది. మనము మాట్లాడే మాటలలోను, తలంచే తలంపులలోను, చేసే పనులలోను, చేసే స్నేహాలలోను జాగ్రత్త అవసరం. అవి మన ఆధ్యాత్మిక అభివృద్ధికి తోడ్పడాలి. సజ్జనసాంగత్యం లభించడం కూడా గొప్పవరం. ఈ మానవ శరీరము ప్రసాదింపబడినందుకు పరమప్రయోజనమైన అమృతస్థితిని తానుగా అనుభవైకవేద్యం చేసుకొనుటకు చిత్తశుద్ధితో ముందుకు సాగాలి. మనము మానవులుగా పుట్టినది ఎందుకంటే ఇక తిరిగి పుట్టకుండా ఉండడానికే!

**- చావలి సూర్యనారాయణమూర్తి**, అమలాపురం

# దేవుడిగా మారే కళను గురువు ద్వారా నేర్చుకోవటమే జీవితలక్ష్యం

ఇది నాది, అదినాది అని మనం ఎంతెంతగా చెబుతామో మన మనస్సు దాని రాజ్యం అంత విశాలమౌతుంది. మనో వైశాల్యం పూర్తిగా పడిపోయినప్పుడు అహంకారం సూక్ష్మమైపోయి మనకు జయం చేకూరుతుంది. చక్రవర్తి అయిపోతాము. దీనికి గురువు అవసరం ఎంతో ఉంది. ఆయన మనకు ఏమాత్రం తెలియని దారి చూపిస్తారు. ఈ సృష్టిలో వ్యాపించి ఉన్న ఆనందపు మెరుపులను మనకు అందిస్తారు. కాని మనం గుడ్డివాళ్లము. కళ్ళు తాను నేర్చుకొన్న విశేషాలను చూపగలవు. ఆనందపు మెరుపులను పట్టుకోలేవు. తాను ఎవరో తనకు తెలిసిన గురువుతో మనం కలవాలి. మన నడకలో ఏదైనా తప్పు జరిగితే ఆయన సరిచేయగలరు. మనం గతం, అనాగతం ఆయనకు తెలుసు. వాటిని నివృత్తి చేయగలరు. ఇతరులు కుతూహలంగా చేస్తున్నారని మనం అనుసరించకూడదు. గురువు మార్గ దర్శకత్వమే మనకు శ్రీరామరక్ష ఒక గురువు వద్దకు వచ్చే ప్రజలు అందరూ ఒక సదుద్దేశంతో రారు. అది ప్రకృతి న్యాయంలా కనిపిస్తుంది. కొద్దిమంది మాత్రమే సత్యాన్ని పొందగోరి వస్తారు. మరి కొందరు గురువుగా ఉండటం ఏలాగో తెలుసుకోవాలని, వారికి అధికారం, ప్రతిష్ట, గౌరవం, సంపద కలగాలని వేలాది శిష్యులతో గొప్ప గురువుగా ఉండాలని అభిలషిస్తారు. వారికి సత్యం తెలుసుకోవాలనే కాంక్ష ఉండదు. అసలు శిష్యరికం అంటే కఠినమైన విషయం. దానికి మనం సిద్ధంగా ఉన్నామా? కేవలం ఉత్సుకత మాత్రమేనా? అలా ఉంటే వారు తొందరలోనే గురువును ంచి వెళ్లిపోవలసి ఉంటుంది. మనం నిష్కపటమైన సత్యాన్వేషి అయి ఉంటే అన్నిటినీ పణంగా పెట్టటానికి సిద్ధంగా ఉండాలి. అప్పుడే సాధ్యము.. అంటే దొడ్డి దార్లులేవు. ప్రతీ గొప్ప గురువునూ ఏసును పట్టించినా జూడాస్‌లు ఉంటారు. ఉండి తీరుతారు. వారు అధికార దాహంతో ఉంటారు. వారి జీవితాన్ని వారికి ఇయ్యబడిన గొప్ప అవకాశాన్ని నాశనం చేసుకొంటారు. గురు స్పర్శ కంటికి, బుద్ధికి అందదు. అహంకారం చాలా ప్రమాదమైనది. జ్ఞానినైనానని సింహాసనం ఎక్కిస్తుంది. తనకు ఏమీ తెలియదన్న ఎరుక వినయాన్నియిస్తుంది. నిజమైన జ్ఞానం కోసం అహంకారం కరిగిపోవటం అనివార్యం. నిర్మోహస్థితి అహంకారినికి ఇష్టముండదు. ఇంకా ఇంకా సంపాదించాలని ప్రయత్నిస్తుంది. ఏ సంపాదన అయినా అది మన ఆంతరంగిక దారిద్ర్యాన్ని చూపుతుందనే విషయాన్ని జ్ఞాపకముంచుకోవాలి. జ్ఞానశిఖరాలు ఎక్కడం శ్రమతో కూడిన పని. విషయాలోలత్వం పొందడం పశుతత్వంగా ఉండటం తేలిక. అందుకే సాధన కావాలి. అది నిరంతర శ్రమ, సంకల్పబలంతో అనుక్షణం ప్రయత్నం వల్ల, గురుకృపవల్ల పురుషార్థాన్ని పొందుతాము. పైకి లేవటం అన్నింటి కంటే గొప్ప కళ. మనలోని దైవత్వంలో ప్రతిష్టితం కావటమే మనకు మిగిలియున్న ఒకే ఒక్క రక్షణా మార్గం. మనలను గురువు నడిపిస్తున్నారు అనే స్పూర్తి గురుమంత్రం కన్నా గొప్ప శక్తిని ఇస్తుంది. గురు ప్రార్థన మనకు మన మనస్సుకు వారధిని నిర్మిస్తుంది. అదే ధ్యానం, ధారణ, తపస్సు, గురువుకు ఎదురు తిరిగిన, చెప్పిన మాట వినకపోయినా నష్టపోయేది కష్టపడేదీ మనమే. వివేకానంద “మన మనస్సులో ఉత్సాహం, గురుభక్తి విశ్వాసం ఎంతవరకూ ఉంటాయో అంతవరకూ ఈ సృష్టిలో ఏ శక్తీ మనలను అణచలేదు” అన్నారు. జన్మసాఫల్యానికి గురు ప్రేమ కీలకం.

- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం